వేదాంతభేరి

డిశెంబరు 2020 రూ. 10/-

గీతా మకరందము



వేదాంతభేరి

డిశెంబరు 2020 రూ. 10/-

గీతా మకరందము

శ్రీశుకబ్రహ్మాశ్రమములో దేవీనవరాత్రుల పూజ

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 డిశంబర్ 2020 సంచిక : 12

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 డిశంబర్ 2020 సంచిక : 12

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ఉపనిషత్సారము గీత-శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. గీతాశయము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 12
04. వృత్తి , ప్రవృత్తి పరమాత్మ పరమైతే పనులన్నీ పరమాత్మ సేవలే అవుతాయి - శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వాములవారు - 14
05. కర్మయోగము - శ్రీరామకృష్ణానందగిరిస్వాములవారు - 19
06. సాధన పంచకమ్ - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 23
07. భాగవతంషష్ఠస్కంధము-శ్రీమాతా పరావిద్యానందగిరిస్వామిని-25
08. కోపము - శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు - 27
09. ప్రయాణం - డా॥ తారాలక్ష్మి - 31
10. వరాహావతార ప్రశస్తి - ఆర్. శోభాదేవి - 34
11. గోప్రశస్తి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 37
12. వార్తలు - 42

ముఖచిత్రం - గీతామకరంద ప్రదాత శ్రీకృష్ణ భగవానుడు

01-12-2020 తుంగభద్ర పుష్కరాలు సమాప్తి
12-12-2020 ధన్వన్తరి జయన్తి
15-12-2020 ధనుర్మాస ప్రారంభం
20-12-2020 సుబ్బరాయ షష్ఠి
25-12-2020 గీతాజయన్తి
29-12-2020 దత్తాత్రేయ జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. నమస్తే సర్వతస్సర్వ సర్వతోఽక్షిశిరోముఖ ।
నిర్వికార నమస్తేఽస్తు సాక్షీ క్షేత్రే వ్యవస్థితః ॥
2. విశ్వకర్మన్ నమస్తే ఽ స్తు విశ్వాత్మన్ విశ్వసమ్భవ ।
అపవర్గో ఽసి భూతానాం పఞ్చానాం పరతః స్థితః ॥
3. నమస్తే త్రిషులోకేషు నమస్తే పరతస్త్రిషు ।
నమస్తే దిక్షు సర్వాసు త్వం హి సర్వమయో నిధిః ॥
4. నమస్తే భగవాన్విష్ణో లోకానాం ప్రభవాప్యయ ।
త్వం హి కర్తా హృషీకేశ సంహర్తా చాపరాజితః ॥
5. అప్రమేయ శరీరాయ సర్వతో బుద్ధిసాక్షిణే ।
అనన్తపరమేశాయ తస్మై దివ్యాత్మనేనమః ॥
6. జటినే దణ్డినే నిత్యం లమ్బోదర శరీరిణే ।
కమణ్డలు నిషఙ్గాయ తస్మై బ్రహ్మాత్మనే నమః ॥
7. శూలినే త్రిదిశేశాయ త్ర్యమ్బకాయ మహాత్మనే ।
భస్మతిక్తాఙ్గలిఙ్గాయ తస్మై రుద్రాత్మనే నమః ॥
8. సర్వభూతాత్మ భూతాయ భూతాదినిధనాయ చ ।
అక్రోధద్రోహమోహాయ తస్మై శాన్తాత్మనే నమః ॥
9. యస్మిన్సర్వం యతస్సర్వం యస్సర్వం సర్వతశ్చ యః ।
యశ్చ సర్వమయో నిత్యం తస్మై సర్వాత్మనే నమః ॥
10. యస్మాత్సర్వాః ప్రసూయన్తే సర్గప్రలయవిక్రియాః ।
యస్మిం శ్చైవ ప్రలీయన్తే తస్మై హేత్వాత్మనే నమః ॥

ఉపనిషత్సారముగీత

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

వేదముల సారము ఉపనిషత్తులు. ఉపనిషత్తుల సారము భగవద్గీత. ఉపనిషత్తులకు వేదాంతశాస్త్రమని, శ్రుతిశిరస్సులని పేర్లు కలవు. వేదములయొక్క అంతమున తెలుపబడిన సారభూతమైన సాహిత్యమగుటచే వేదాంతమనియు, శరీరమునకు శిరస్సు ప్రధానమై యున్నట్లు శ్రుతులలో ప్రధానభాగమగుటచే శ్రుతిశిరస్సులనియు, వానిని పేర్కొనుట సంభవించినది. ఈ ప్రకారముగ ఉపనిషత్తులు అధ్యాత్మ వాఙ్మయమున కీలకస్థాన మాక్రమించుకొనియున్నవి. మహోన్నతమగు వేదవృక్షముయొక్క ఫలస్వరూపములగు ఆ ఉపనిషత్తులను తెలిసికొని, ఆస్వాదించి జన్మ సార్థకమొనరించుకొనవలెనని ప్రతిముముక్షువుయొక్క చిత్తము సాధారణముగ ఉత్కంఠితమగుచుండును. కాని ఉపనిషత్తులయొక్క భాష, భావము సామాన్యులకు దురవగాహమై అందుబాటులో లేకయున్నది. ఇక వారికి ఉపనిషన్మాధుర్యమును చవిచూచు అవకాశమెచట? తదుపదిష్టమగు విజ్ఞానమును అనుభూతమొనర్చుకొనుటకు ఆస్కార మెచట? ఇది యొక చిక్కు సమస్యయై కూర్చున్నది. ఈ సమస్యను పరిష్కరించుటకు భగవానుడు పూనుకొనెను. మఱియు తద్వారా జన సామాన్యమునకు మహోపకారము చేయ సంకల్పించెను. వారు చేసినది ఏమి యనగా, ఉపనిషత్తులను గోవులను ముందు పెట్టుకొని, అర్జునుడను దూడను నిమిత్తముగా జేసికొని, గోపాలనందనుడగు తానే వాని నన్నిటిని పిండి బ్రహ్మజ్ఞానామృతమను ఆ క్షీరమును ముముక్షువు లందఱికిని పంచి పెట్టెను. ఆ క్షీరమే భగవద్గీత. ఈ ప్రకారముగ జఠిలమగు వేదా

విజ్ఞానమును భగవద్గీత యను సులభసాహిత్యము ద్వారా శ్రీకృష్ణమూర్తి జనులకందజేసి లోకమునకు మహోపకారమొనర్చెను. గీత అర్జునునకు బోధింపబడినదని జనులు స్థూలముగ తలంచుదురు. కాని, వాస్తవముగ అది విశ్వప్రాణి కోటికి ఉపదేశింపబడినది. దూడవంతునకు వచ్చు పాలు కొద్ది మాత్రమే కదా. తక్కిన పాలంతయు ఇతరుల పాలిటయే వచ్చిపడును. 'సుధీర్భోక్తా'-అని చెప్పబడినందున బుద్ధిమంతులెల్లరును (మోక్షాపేక్షకల వారందఱును) దానిని త్రాగి సుఖించవచ్చునని స్పష్టమగు చున్నది. మఱియు 'గీతామృతం మహత్' అని పేర్కొనినందువలన, ఇది లౌకికమగు స్వర్గమందలి అమృతము కాదనియు, పారలౌకికమగు సచ్చిదానందరసామృతమనియు తేలుచున్నది. కావున సులభశైలితో, గంభీరభావములతో నొప్పారుచు, సాక్షాత్ భగవంతునిచే లోకమునకు ప్రసాదింపబడిన "ఉపనిషత్తుల యొక్క సారము" (Essence) అగు ఈ గీతను పఠించి, అనుష్ఠించి, భవదుఃఖమును బాపుకొనుట ప్రతిజీవి యొక్కయు కర్తవ్యమై యున్నది.

గీతా జ్ఞానము అనంతము : గీత యొక్క మహిమను వర్ణించినకొలది అంతులేక యుండును. భగవంతు డెట్లు అనంతుడో భగవద్వాణి యొక్క మహత్తున్ను అనంతముగా గన్పట్టగలదు. 'కృష్ణస్తు భగవాన్ స్వయం"-అని చెప్పబడినందు వలన గీతాచార్యుడును, జగద్గురువు నగు శ్రీకృష్ణమూర్తి సాక్షాత్ భగవంతుడే కనుక, కృష్ణవాణి భగవద్వాణియే యగును. గీతను చదివిన ప్రతివానికిని అది దైవనిర్మిత పదార్థమని స్పష్టముగ తెలియగలదు. ప్రతి అక్షరమందును, ప్రతిశ్లోకమునందును దైవత్వము తొణికిసలాడుచుండును. ఒక్కొక్క శ్లోకమునందు ఎన్నెన్నియో నూతన నూతన అర్థములు ద్యోతకము లగుచుండును. వెయ్యేల, శ్లోకబిందువునందు జ్ఞానసింధువు కలిగి యుండుననుటలో అతిశయోక్తి లేదు. ఎవరెవరి సంస్కారము ఏయే విధముగ నుండునో వారివారికి తగిన అర్థము దానిలో స్ఫురించుచుండును. మఱియు

చిత్తము శుద్ధమగుచుండుకొలది ఒకే శ్లోకమునందు వినూతన, విశాల భావములు గన్పట్టుచుండును.

The suggestiveness of this wonderful book is really infinite.

'ఆశ్చర్యకరమగు ఈ గ్రంథము యొక్క వినూతన భావస్ఫురణ శీలత్వము వాస్తవముగ అనంతమైనది' అని ఒక మహనీయుడు నుడివెను. అయితే ఎవరెవరు ఎన్నెన్ని అర్థములు లాగినను, ఎన్నెన్ని భాష్యములు వ్రాసినను, ఇంకను అనంతవిజ్ఞానము దాని యందు మిగిలియే యుండును. ఒక నదీప్రవాహమందు ఒకడు చిన్న చెంబుతో నీళ్లు ముంచుకొనిపోవును. మఱియొకడు బిందెతో నీళ్లు తీసికొనిపోవును. ఇంకొకడు పీపానిండుగ తీసికొని వెడలును. మఱియొకడు 'టాంకు'ను నింపుకొనిపోవును. ఈ ప్రకారముగ వారివారి శక్తి కొలది ఎంతెంత తీర్థము గ్రహించి వెడలినను నదియం దింకను అనంతజలము శేషించియే యుండును. అట్లే గీతా గంగప్రవాహమున శంకరాచార్యు లొక పెద్ద పాత్రనిండుగ విజ్ఞానమును తోడుకొనివెళ్ళిరి. అట్లే రామానుజులు, మధ్వాచార్యులు, శ్రీకంఠశివాచార్యులు మున్నగు మహనీయు లనేకులు వారి వారి శక్తికొలది బుద్ధిరూప పాత్రలనిండుగ గీతార్థమును గ్రహించి వెళ్ళిరి. అట్లే ఆధునిక కాలమున తిలక్‌మహాశయుడు, గాంధీమహాత్ముడు, అనిబిసెంటు మున్నగు వారున్ను గీతామృతమును చేదుకొని వెడలిరి. ఇంకను అనేకులు చేదుకొనుచున్నారు. మున్ముందును పెక్కండ్రు చేదుకొనగరు. కాని ఇందరు మహాత్ములు గీతను మథించి కొందఱు ద్వైతపరముగ, కొందఱు విశిష్టాద్వైతపరముగ, కొందఱు అద్వైతపరముగ, అట్లే కొందఱు కర్మపరముగ, కొందఱు భక్తిపరముగ, కొందఱు యోగపరముగ, కొందఱు జ్ఞానపరముగ అర్థములు చెప్పుచున్నను, భావములను వెల్లడించుచున్నను

ఇంకను గీతయందెంతయో విజ్ఞానభండారము మిగిలియే యున్నది. ఇదియే గీతయొక్క మహావిశిష్టత. ఇట్టి శక్తి మఱి ఏ యితర గ్రంథమునకున్నులేదు. కనుకనే గీతను సంపూర్ణముగ తెలిసి కొనినవాడు ప్రపంచములో ఒక్కరు మాత్రమే కలరని చెప్పబడినది. వారే శ్రీకృష్ణుడు. తక్కిన వారందఱు గీతయొక్క ఒకానొక అంశమును మాత్రమే గ్రహింపగల్గిరట!

కృష్ణో జానాతి వై సమ్యక్ కించిత్కున్తీసుతః ఫలమ్
వ్యాసోవా వ్యాసపుత్రోవా యాజ్ఞవల్క్యో ఽథ మైథిలః.

"గీతార్థమును,గీతామహిమను,కృష్ణుడొక్కడు మాత్రమే సంపూర్ణముగ నెఱిగి యున్నాడు. అర్జునుడు, వ్యాసులు, శుకులు, యాజ్ఞవల్క్యుడు, జనకుడు మున్నగు తక్కినవారందఱున్ను ఒకింత మాత్రమే తెలిసికొని యున్నారు." ఓహో ! గీతామహిమ యెట్టిదైయున్నది!! గీతార్థము ఎంత అపారమైయున్నది !!

అయితే ఇచ్చోట ఒక ధర్మసూక్ష్మమును గ్రహించవలసియున్నది. అది యేదియనగా అమృతమును ఒక బిందువు త్రాగినను, చెంబుడు త్రాగినను, ఇంకను అధికముగా త్రాగినను ఫలితము ఒకటే. మరణ రాహిత్యము అందఱికిని సమానముగ సిద్ధించును. అట్లే గీతామృతమును ఒకింత గ్రోలినను, అధికముగ గ్రోలినను భవదుఃఖహరణము, మోక్షప్రాప్తి, సమానముగనే సంభవించును. కాబట్టి ఈ విషయమై ఎవరును దిగులు పడక, శంకరాదుల వంటి మేధాశక్తి లేకపోయినప్పటికిని, నిరుత్సాహపడక గీతోక్తధర్మములలో కనీసము ఒకదానినైనను చక్కగ అనుష్ఠించుటకై ప్రయత్నము సలుపవలెను. దానిచే నతడు పరమశాంతిని తప్పక బడయ గలడు.

భారత సర్వస్వము గీత : శ్రీ భగవద్గీత మహాభారతములోని భీష్మపర్వము

నందు 25వ అధ్యాయము మొదలుకొని 42వ అధ్యాయము వఱకు గలదు. భారతమును మహాసముద్రమున దీపస్తంభము (Light house)వలె గీత మెఱయు చున్నది. అష్టాదశ పురాణములను, నవవ్యాకరణములను, నాలుగు వేదములను చక్కగ మథించి వ్యాసమునీంద్రులు భారతమును రచించెను.కావుననే భారతము పంచమవేదమని ప్రఖ్యాతిగాంచినది. అట్టి మహోత్కృష్ట కావ్యముయొక్క సారమే భగవద్గీత. శ్రీకృష్ణపరమాత్మ జ్ఞానామృతమును వర్షించుచుండ వ్యాసమునీంద్రులు మహాభారతమను కలశమున దానిని పట్టియుంచెనని అలంకారికభాషలో చెప్పవచ్చును. మఱియు-

ధర్మే చార్థేచ కామేచ మోక్షే చ భరతర్షభ

యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్. (భారతము)

"ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములను గూర్చి భారతమున ఏమేమి తెలుపబడినదో అదియే ఇతరచోట్ల యందును తెలుపబడినది. దీనియందు లేనిది మఱి యెచటను లేదు." ఇంతియేకాదు "యన్న భారతే తన్న భారతే" - భారతమున లేనిది భారతదేశముననే లేదు-ఈ ప్రకారమగు అనుపమఖ్యాతి నార్జించినది మహాభారతము. ఇక నద్దానిలోని భగవద్గీత యెట్లుండునో పాఠకులే ఊహించుకొన వచ్చును. కనుకనే శ్రీ ఆదిశంకరులు గీతాభాష్యము వ్రాయుచు ప్రారంభముననే -

తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థసార సంగ్రహభూతమ్.

'ఈ గీతాశాస్త్రము సమస్త వేద వేదాంతములయొక్క సార సంగ్రహము' అని పేర్కొనియున్నారు. అట్లు కానిచో ఖండ ఖండాంతరము లందలి ప్రాజ్ఞులెల్లరు దీనిచే ఏల నాకర్షింపబడుదురు? మధువులేనిచో తుమ్మెదలు రావుగదా! గీతయందు తెలుపబడినది అవ్యయమగు బోధ.

దానికి నాశము లేదు. దేశకాలములు మారినను అది మారదు. చెక్కు చెదరదు. అది యుగయుగములకును పనికివచ్చు ధర్మము. కనుకనే గీతాచార్యులు దానిని గూర్చి మూడవ అధ్యాయములో "ప్రోక్తవానహ మవ్యయమ్"-అవ్యయమైన ఈ బ్రహ్మవిద్యను, యోగశాస్త్రమును పూర్వము నేను సూర్యున కుపదేశించితిని, అని వాక్రుచ్చిరి. మఱియు నిది అతి రహస్యమగు విద్య. కానిచో 'ఇదంతు తే గుహ్యతమం'- ఈ మహాగోప్యమగు శాస్త్రమును నేను నీకు చెప్పుచున్నానని గీతాచార్యులు పదేపదే గీతయం దేల ఉద్బోధించవలెను? ఈ ప్రకారముగ అతిరహస్యమై, అఖండమైనట్టి ఈతత్త్వబోధ ఒక దేశమునకు గాని, ఒక కాలమునకుగాని, ఒక మతమునకు గాని, ఒక జాతికిగాని, ఒక సంప్రదాయమునకు గాని సంబంధించినదికాక సర్వదేశములకు, సర్వకాలములకు,సర్వమతములకు, సమస్త సంప్రదాయములకు చెందినదై యున్నది. సర్వమతములసారము దీనియందు కలదు. కాబట్టి భగవద్గీత కేవలము హిందువుల మతగంథ్రము మాత్రమే యని చెప్పుట పొరపాటు. ఇది సార్వభౌమగ్రంథము. కావున దీని నాశ్రయించువారు ధర్మరహస్యములనెల్ల గ్రహించి అచిరకాలములో పరమశాంతిని తప్పక బడయగలరు.జ్ఞానేశ్వరుడు గీతనుగూర్చి ఈ క్రింది విధముగ ప్రస్తుతించెను- "గీత వివేకవృక్షములకు తోట. సర్వసుఖములకు పునాది. పరమార్థసిద్ధాంతరత్నఖని, నవరసములను అమృతముచే నిండిన సముద్రము. తెఱవబడియున్న పరంధామము. సర్వవిద్యలకు మూలభూమి. సర్వశాస్త్రములకు ఆశ్రయము. సర్వ ధర్మములకు మాతృభూమి. సజ్జనులకు ప్రేమాస్పదమిత్రుడు, సరస్వతియొక్క లావణ్యరత్నముల భండారము. జ్ఞానామృతపూర్ణగంగ, వివేకమను క్షీరసముద్రయొక్క నవలక్ష్మి"-అని. మహనీయుల దృష్టియందు గీత ఎట్టి పూజ్యస్థానమును ఆక్రమించుకొని యున్నదో ఈ పైవాక్యములు ఋజువుచేయుచున్నవి.



గీతాశయము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

శ్రీ భగవద్గీత కర్మయోగమునే యుపదేశించుచున్నదని కొందరు మఱికొందరు భక్తి యోగమునే యుపదేశించుచున్నదని, ధ్యాన యోగమునే ఉపదేశించున్నదని వేరుకొందరు, జ్ఞానయోగమును యుపదేశించు చున్నదని యితరులు కొందఱు చెప్పుచున్నారు. వీరు చెప్పు భావ మంతయు గీతలో గలదు. కాని అంతటితో పూర్తి కాలేదు.

18 అధ్యాయములలోను ప్రతి అధ్యాయాంతమున యోగశబ్ద ముండుటచే ఈ18 యోగములను శ్రీకృష్ణ భగవానుడుపదేశించెనని గ్రహించుటయే యథార్థమగును. ఈ 18 అధ్యాయములు గీతాకల్పతరువు యొక్క శాఖలే యగును. ఇవి యన్నియు చేరినదే గీతాకల్పతరువుయగును. ఒక్కొక్క దానిని చెప్పువారు ఒక్కొక్క శాఖను చెప్పిన వారగుదురు. కర్మ, భక్తి, యోగ, జ్ఞానములనెడి 4 యోగములలో తక్కిన 14 యోగములు అంతర్భూతములేయని గ్రహించదగును. ఏలయన ఈ నాల్గు యోగములు మాత్రమే జగద్విఖ్యాతి గలిగియున్నవి.

ముఖ్యముగా కర్మయోగమే గీతాశయమని ఎక్కువమంది ఆశయమై యున్నది. ఉత్తర గీతను గూడ చదివిన మాత్రమే ఈ గీతాశయమును పూర్తిగా తెలిసికొన సాధ్యమగును. ఏలన? మానవుని జీవితము పూర్వ భాగమనియు, ఉత్తర భాగమనియు రెండు భాగములుగా విభజింపబడి యున్నది. బ్రహ్మచర్య గృహస్థాశ్రమములు పూర్వ భాగముగాను,వానప్రస్థ సన్న్యాసములను ఉత్తర భాగముగాను చెప్పిరి. పూర్వభాగమగు గృహస్థాశ్రమము నందు ఉండునప్పుడే గీత ఉపదేశింపబడినది. ఉత్తరాశ్రమము నందు (ఉత్తర భాగమందు) ఉండునప్పుడు ఉత్తర గీత ఉపదేశింపబడెను. కావుననే దానికి 'ఉత్తరగీత' యను పేరు గలిగినది. అందువలన అంతఃకరణ శుద్ధి కలుగువఱకు నిష్కామకర్మయోగము ననుష్ఠించి తరువాత జ్ఞానయోగము ననుసరించవలయు ననియే గీత బోధించుచున్నది.

ఈ తత్త్వము నాధారము చేసికొనియే కృష్ణముఖారవిన్దము నుండి స్వయముగా గీతామృతోపదేశమును పొందిన అర్జునాది పాండవులు అయిదుగురు, ద్రౌపదియు అంత్యకాల మాసన్నము గాక మునుపే సర్వసంగపరిత్యాగులై తీర్థయాత్రాపరులై అచ్చటచ్చట తపమొనర్చుచు కట్ట కడకు హిమాలయ ప్రదేశమగు హృషీకేశము జేరి అట నుండి స్వర్గారోహణ మొనర్చిరి. ఈ గాథలన్నియు మహాభారత మహాప్రస్థాన పర్వమునందు గనందగును. నిష్కామకర్మ యోగమునే శ్రీకృష్ణడుపదేశించి యుండిన పాండవులంత్యకాలము వరకును స్వగృహమందుండియే ఫలాపేక్షారహితులై కర్మయోగము ననుష్ఠింపవలసి యుండును.

బ్రహ్మ విచారమునకు సర్వ త్యాగము,ఏకాంతవాసమున్ను అవశ్యముగా నుండవలెను. లేనిచో నిర్విషయ, నిర్వికార, నిర్వికల్పమగు బ్రహ్మ సమాధిని పొందజాలరు. కావుననే క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగమున జ్ఞానము నుపదేశించిన తరువాత "జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వా అమృత మశ్నుతే' అని తెలుపబడినది. కావున జ్ఞేయమును పొందుటయే గీతయొక్క ఆశయమగును.

కృతజ్ఞతలు

వేదాన్తభేరికి తమ విలువైన వ్యాసాలనందించిన రచయితలకు, పోషక, వార్షిక చందాదారులకు తమ ప్రకటననిచ్చి సహకరించిన సుభద్రాఛారిటబుల్ ట్రస్టు (హైద్రాబాద్) వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

వృత్తి, ప్రవృత్తి పరమాత్మ పరమైతే పనులన్నీ పరమాత్మ సేవలే అవుతాయి

- శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వాములవారు

మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః ।

నిర్వైర స్సర్వభూతేషు య స్స మామేతి పాండవ ! ॥

అర్జునా, తన ధర్మములను నాయారాధన బుద్ధితో చేయువాడును, నేనే ప్రధానోద్దేశముగా గలవాడును, పరమ ప్రీతితో నన్నే ధ్యానించువాడును, నాకంటే వేరైన వస్తువులతో తనకు సంబంధము లేనివాడును,సకల ప్రాణుల యందును విరోధములేని వాడును ఎవడో వాడు, నన్ను పొందు చున్నాడు.

మానవ జీవితం పనిచేయడం కోసం ఏర్పడినది. ఒక వ్యక్తికి ఒక ఊళ్లో ఉద్యోగం ఇస్తే, ఆ ఉద్యోగం కోసం ఆ ఊరు వెళ్ళిన వాడు ఆ ఉద్యోగం ఉన్నంత వరకూ, ఆ ఊరిలో ఆ ఉద్యోగకృత్యమేదో దానిని నెరవేరుస్తూనే ఉండాలి. అలానే మానవ శరీరంలోకి రావడానికి లక్ష్యం ఈ శరీరాన్ని వినియోగిస్తూ, ఇచ్చిన వాడివైపు ప్రయాణం కొనసాగించడం. దీనిని ఇచ్చినవాడు ఎవడో భగవద్గీత చెపుతుంది. ఎన్నో రకాల దర్శనాలున్నాయి. ఎందరో మత ప్రవక్తలున్నారు. ఎన్నెన్నో రకరకాలుగా వారు చెప్పారు. కానీ భగవద్గీతలో శ్రీకృష్ణుడు "ఈ శరీరంలో జీవుని కూర్చిన వానిని నేను" అని చెప్పాడు. 'అహం బీజప్రదః పితా'ఈ ప్రకృతిని ఒక శరీరంగా మారేలా చేసి, అది మానవాకృతి వచ్చేటట్టు చేసి, అందులో ఈ జీవిని నిలిపిన వాడిని నేనే అన్నాడు.

అనేక జన్మలనుండి తెచ్చి పెట్టుకున్న కర్మలభారాన్ని తగ్గించుకోవడానికి మానవదేహం అన్నిటికంటే ఉత్తమమైన సాధనమని భగవంతుడు జీవుడికి ఈ శరీరాన్ని లభించేలా చేసాడు. అయితే ఈజీవుడు తన ప్రవృత్తి వల్ల కర్మను తొలగించుకోవచ్చు. కర్మను పెంచుకోనూవచ్చుకూడ. మానవ శరీరం అంత గొప్పది.

ఎలా చేస్తున్నావో, ఎందుకు చేస్తున్నావో, తెలిసి ఆచరిస్తే ఆ తెలివి ఆ చేసే పనిని అంటనివ్వదు సరికదా, గతంలో ఉన్న ప్రాచీనమైన కర్మ నంతటినీ భస్మంచేసి పారేస్తుంది. దూది బోలెడంత ఉన్నా ఓ చిన్న నిప్పుకణం దానిలో వేస్తే అంత దూదిని అదెలా భస్మం చేయగలదో అలానే చెయవలసిన కర్మను మనం సరిగా చేస్తే అది ఎన్నెన్నో జన్మల నుంచి పేరుకుపోయి ఉన్న ప్రాచీన పాపరాశినంతటిని భస్మం చేసి పారేయగలదు. చేయవలసిందల్లా భగవన్నామాన్ని మనోమందిరంలో నింపుకోవడమే అని మనకు భగవంతుడు 11వ అధ్యాయపు 55వ శ్లోకంలో చెప్పాడు.

మొదటి శ్వాస నుంచి తుదిశ్వాస దాక పనిచేస్తూండటమే మానవుని కర్తవ్యం. తెలియక కొందరు మేము జ్ఞానులమైపోయాం. మేం రాజయోగులమై పోయాం కనుక మాకు ఈ పనులన్నీ అవసరం లేదు. పుట్టుకతో ఏర్పడ్డ బాధ్యతలను, కర్తవ్యాలను వదలుకొని తమ ప్రకృతి బంధాలన్నీ విడిపోయాయని భ్రమిస్తారు.

భగవద్గీతలో స్వామి ఇది తగదని అనేక సందర్భాలలో స్పష్టం చేసాడు. నీవు ఇక్కడకు వచ్చినది కేవలం కర్మాచరణ కోసమే.

మానవశరీరమే జీవుడికి ఒక ఉద్యోగం. ఇందులో మొదటి శ్వాస నుంచి తుదిశ్వాస దాక ఉద్యోగపు సమయం. కనుక ఉద్యోగ సమయంలో ఇతర ప్రవృత్తులు పనికిరావు. ఫలాశ తగదు. పని చేయక తప్పదు. పనిమానడం తగదు. దానిని కర్మ అంటాడు. కర్మ ఎపుడూ మానద్దు. కర్మ

యందు ఉండే భావనను మార్చు. ఇది వరకు ఇది నా పని, నా విధి, నేను చేసుకుంటున్నా, నా ఫలితం కోసం అనే భావనను మార్చి ఇది భగవంతుడి పని, అతని ప్రయోజనముగా చేసేది, ఫలము ఆతనికే చెందినది, అనుభవించే నాకు అతనితో ఉండే సంబంధం వలన ఈ పని నేను చేయతగును అని నన్ను ఇక్కడికి పంపాడు. అనుకొంటూ చేయాలి.

ప్రతి పనీ చేయకుండ ఉండలేక ప్రీతితో చేస్తారు. ఇపుడు దీనినే 'సేవ' అంటారు లోకుల విషయంలోనైతే. అదే భగవంతుడి విషయంలో అయితే 'కైంకర్యము' అని అంటారు. కింకర అని పనిచేసేవాడికి పేరు. ఆ పేరు ఎందుకు వచ్చిందంటే కిం కరవాణి. కిం కార్యం అని అడిగి, చెప్పినవన్నీ చేసేవాడు కింకరుడు. ఈ కింకరుడు చేసే పనే కైంకర్యం. నిజానికి నేడు లోకంలో ఈ పదాన్ని పాడుచేసేసారు. ఎవరైనా తనదికాని వస్తువును స్వంతం చేసుకునే ప్రయత్నంలో ఉంటే కైంకర్యం చేసాడని అంటున్నారు. కానీ ఆ పదానికి అసలు అర్థం అది కాదు. ఆ పదం చాలా గొప్పది.

ఈ పని, ఆ పని అని లేదు. ఏ పని చేసేవాడైనా తను చేసే పని భగవత్ సేవగా అనుకుని చేస్తే దానినే కైంకర్యం అని అంటారు. 'మత్కర్మ కృత్' నీవు ఏ పనైనా నా పనిగా చేయవయ్యా!' నీవు దానములు చేయి, ధర్మములు చేయి, యోగములు చేయి, యాగములు చేయి, నా సేవ అనుకుంటూ చేయి. నీవు చేసే ఏ పనైనా కైంకర్యమనుకుంటూ చేయి. అది నీకు బంధకం కాకుండా నేను చూస్తా! నేను అట్లానే పనిచేస్తా! కనుక నాకు ఏదీ బంధకం కాదు. నీవు అలా పనిచేయడం ప్రారంభం చేయి. నీకూ అవి బంధకం కాకుండా చూచేవాడిని నేను. ఏ పని అయినా ఫలితం లభించేటట్లు నేను చేయాలి. కనుక అవి నీకు ఉత్తమ ఫలితమిచ్చేలా చేస్తా. బంధకం కాకుండా నేను తీర్చిదిద్దుతాను అని మొదట చెప్పాడు.

రెండవది 'మత్పరమః' నీవు ఏది చేసినా అది చెందేది నాకు అని గుర్తించు. నాకంటే మించి మరొకడు ఎవడూ ఫలితాన్నివ్వగలిగినవాడు లేడు. కనుక ఏది నువ్వు చేసినా, ఇది శ్రీకృష్ణుడిదాకా చెందుతోంది అని అనుకుంటూ చేయ్. "మత్పరమః" నేనే ప్రయోజనంగా కల్గి వుండాలి. లోకంలో పొలం దున్ని పండించేది కూలీలు. ఫలితం పొందేది ఆ పొలం కలిగిన రైతు. కూలీ 'మా యజమాని కోసం చేస్తున్నాను' అంటాడు. యజమానిని దేవుడు అంటాడు. వానికి ఎంతో చాకిరీ చేస్తాడు. ప్రతిగా ఎంతో కొంత జీతం అందుకుంటాడు. కానీ ఆ వ్యక్తి ఆ కూలీవానికి ఆ ఉద్యోగమివ్వడానికి కారణం ఆ వెనుక ఉండే భగవంతుడేనని గుర్తు పెట్టుకొంటూ చేయగల్గితే అదీ భగవంతుడి సేవే. 'అర్జునా! ప్రీతి నీకు ఏర్పడవలసినది నా విషయంలో, అపుడు నీవు నా భక్తుడవు కాగల్గుతావు. 'సంగవర్జితః మద్భక్తః' నాయందు భక్తితో నీకు నాతోనే సంగముంటుంది. ఇతరమైనవాటియందు ఉండదు" అంటాడు స్వామి.

"పరమాత్మని యోరక్తః, విరక్తః అపరమాత్మని" అంటుంది శాస్త్రం. భగవంతుడి మీద ఏర్పడ్డ రుచి భగవదితరమైన వాటియందు ఉండే రుచిని తగ్గిస్తుంది. శ్రీయామునాచార్య స్వామివారు అంటారు."స్థితే ఽరవిందే మకరంద నిర్భర మధువ్రతః నేక్షురసం హి వీక్షతే"అద్భుతమైన తేనెలూరే ఒక పద్మంలో ఒక మధుపంచేరి అందులో ఉండే తేనెను ఆస్వాదించ నేర్చిన తరువాత ఆ ప్రక్కన ఎక్కడో ఉండే ఒక క్షుద్రమైన గడ్డిపువ్వులో ఉండే తేనె కోసం అది ఏ విధంగా ఆశించదో, అదేవిధంగా నాయందు శ్రద్ధ గల్గి సంగం ఏర్పడ్డ వ్యక్తులకు ఇతరమైన అల్పమైన లౌకికమైన వస్తువుల యందు సంగము ఉండనే ఉండదు. ఇది అయిన తరువాత "నిర్వైర స్సర్వ భూతేషు" లోకంలో

దేనియందూ వీడికి వైరంఉండదు. వీడియందు ఎవరికీ వైరం ఉండదు కూడా. లోకంలో అన్నిటి వెనుక ఉండి నడిపించే తత్త్వం ఒకడే పరమాత్మ అయినపుడు, ఒకడు మిత్రుడు, ఒకడు శత్రువు అనే ప్రశ్న ఎక్కడ వుంటుంది? నిజమైన జ్ఞానంకల వ్యక్తికి ఈ దృష్టి ఏర్పడుతుంది కనుక అన్నిటా భగవంతుణ్ణి చూస్తాడు. అలాంటి వాడు నా దివ్యమైన సాయుజ్యాన్ని పొందగలుగుతాడు.

మనం మన పనులను భగవత్ పరం చేద్దాం. సంగం భగవంతుని యందు పెంచుకుందాం. ఆ భగవదనుగ్రహాన్ని మనం మన వారందరికి పంచుదాం! మాధవ సేవగ సర్వప్రాణి సేవ చేయగలిగే యోగ్యత మనకి మరింతగా ప్రసాదించమని కోరుదాం! కేవలం మానవులకి మాత్రమే చేసే సేవ మాధవ సేవ అని దాన్ని అక్కడికి పరిమితం చేయవద్దు. మాధవ సేవగా సర్వప్రాణి సేవ చేద్దాం ! గీతాజ్యోతి మనకందించే సందేశాన్ని మనం ఆచరిస్తూ ముందుకు అడుగువేద్దాం. మాధవ అనుగ్రహాన్ని పొందే ప్రయత్నం చేద్దాం !

భగవంతుణ్ణి ఈ చర్మ చక్షువులతోచూడలేము. సాధనలు చేయగా చేయగా ప్రేమ చక్షువులు ప్రేమ కర్ణాల (చెవుల)తో కూడిన ప్రేమమయ దేహం ఏర్పడుతుంది. ఆ ప్రేమ చక్షువులతో భగవంతుణ్ణి దర్శించవచ్చును. ఆ ప్రేమ కర్ణాల (చెవుల)తో దైవవాణి వినబడుతుంది.

భగవంతుని పట్ల ప్రగాఢ ప్రేమ కలుగకుండా యిది సంభవం కాదు. ప్రేమ పూరితుడైన వ్యక్తి సమస్త ప్రపంచాన్ని భగవన్మయంగా చూస్తాడు. ఆహా రాత్రుళ్ళు భగవంతుణ్ణే స్మరిస్తే సర్వత్రా ఆయన్నే చూడగలము.

– శ్రీరామకృష్ణ పరమహంస

కర్మయోగము

– శ్రీ రామకృష్ణానందస్వాములవారు (గండిక్షేత్రం)

"కర్మజ్యాయో హ్యకర్మణః" (భగ.3 అ.8 శ్లో॥)

ధర్మక్షేత్ర కురుక్షేత్రంలో ఒక దివ్యరథం నిలబడి వుంది. దానిలో నరనారాయణులు జంటగా కూర్చొని వున్నారు. ఒకడు అంతాచేసి యేమీ చేయనివాడు, అతడు నరుడు, నరోత్తముడు. మరొక్కడు యేమీ చేయక అంతా చేసేవాడు, అతడు నరరూపధారి నారాయణుడు. ఒకనిది కర్మలో కర్మ, మరొక్కనిది అకర్మలో కర్మ. నరుడు చేసేవాడు, నారాయణుడు చూచేవాడు. నరునిది కర్మ యోగం, నారాయణునిది కర్మ సంన్యాసయోగం. లోకనీతికి అనుకూలమైంది నరుని ఆచరణే కాని, నారాయణుని ఆదర్శం కాదు. అది అతి లౌకికమైన సంగతి.

కాబట్టే కర్మత్యాగం కంటె కర్మయోగమే మంచిదంటూ నారాయణుడు నరునికి బోధించాడు. జ్ఞానం తోడై వుంటే కర్మ త్యాగం కాని కర్మయోగం కాని సమాన స్థాయిలోనే వుంటాయి. కాని జ్ఞానసిద్ధికి పూర్వదశలో కర్మత్యాగానికి కర్మ యోగానికి వుండే వ్యత్యాసం ఆకాశ పాతాళాల అంతటిది. జ్ఞానం లేని దశలో కర్మ త్యాగం తమోగుణానికి దారి తీస్తుంది. జ్ఞానం లేని దశలో కూడ కర్మయోగం చిత్తశుద్ధిని కల్గించి మానవుని ఉద్ధరిస్తుంది. ఈ రెంటికి నోటుకు నాణ్యానికి వున్నంత వ్యత్యాసం వుంది. స్వంత ప్రభుత్వంలో నోటుకూ (కరెన్సీకి) నాణ్యానికి ఒకే విలువ. కాని ప్రభుత్వం పడిపోతే లేదా ప్రభుత్వ పరిధి దాటిపోతే నోటు యెందుకూ పనికిరాదు. నాణ్యం విషయమలా కాదు. కరిగిస్తే లోహమైనా పనికి వస్తుంది.జ్ఞానం లేని దశలో కర్మత్యాగం వ్యర్థమే కాదు అనర్థకారి కూడ. జ్ఞానంతో తోడు లేకున్నా కర్మయోగం చిత్తశుద్ధిని కల్గించి మానవుని

ముందుకు తోస్తుంది.

కర్మత్యాగం కర్మ సంన్యాసమనే మాటకు అర్థం "కర్మ శూన్యత" కాదు. భగవద్గీత సకామకర్మలను యెంతగా నిరసించిందో, కర్మ శూన్యతను అంతకంటె హీనంగానే నిరసించింది. కర్మ శూన్యతను కర్మ సంన్యాసమను కొనుట పొరబాటు. కర్మలను వదలడం కర్మసంన్యాసం కాదు. కర్మ యోగంలో జ్ఞానం కలసినప్పుడు అదే కర్మ సంన్యాసమై కూర్చుంటుంది.

భగవద్గీతలో మూడవ అధ్యాయం కర్మయోగం. నాల్గవ అధ్యాయం జ్ఞానయోగం. అయిదవ అధ్యాయం కర్మ సంన్యాస యోగం. కర్మకు కర్మ సంన్యాసానికి మధ్య 'జ్ఞానం' వుంది. కర్మలలో జ్ఞానం కలిసి కర్మ సంన్యాస మైందని అర్థం. అంతేకాని భగవద్గీత అభిప్రాయంలో కర్మలను వదిలితే కర్మసంన్యాసం కాదు. ఆత్మయందు వదలుటా లేదు. పట్టుటా లేదు. వదలుట పట్టుట ప్రకృతి రాజ్యంలోవే. వదలుట కూడా ఒక కర్మే. వదలుట నిషేధముఖ కర్మ, చేయుట అన్వయ ముఖకర్మ.. ఏనాటికైనా నిషేధముఖం కంటె అన్వయ ముఖం మంచిది.

కర్మలను చేస్తూ ఫలాన్ని త్యాగం చేయడంతో వాసనాక్షయం కల్గుతుంది. వాసనాక్షయంతో చిత్తశుద్ధి లభిస్తుంది. చిత్తశుద్ధితో ఆత్మజ్ఞానం, మోక్షం సిద్ధిస్తుంది. తోడ్తోడ కర్తృత్వత్యాగం కల్గింది. కర్తృత్వ త్యాగంతో సర్వకర్మబంధ నివృత్తి సహజంగా చేకూరింది. పద్ధతి యిదికాని, కర్మలను స్వరూపతః వదలుట కాదు. కర్మలను వదిలితే వాసనాక్షయానికి కాని చిత్తశుద్ధికి కాని మోక్షానికి కాని అసలు మార్గమే మూసినట్లవుతుంది.

జ్ఞానులు, భక్తులు, సాధులు, సంన్యాసులు పనులు చేసేవాళ్లు కాదని పనులు పాటలు సంసారులకే అని ఒక పిచ్చిభ్రాంతి లోకంలో వుంది. మానవలసింది పనికాదు. ఫలకాంక్ష, పనిచేస్తూ ఫలకాంక్షకు అతీతులుగా వుండాలె. అంతేకాని, భక్తులు, జ్ఞానులు పనిచేయక ఫలం

కోరే పాపిష్ఠులు కారు. తాపసులు తామసులు యెప్పుడూ కారు. పనిచేసేందుకు పొలుమాలి పరాయి కూటికి ప్రాకులాడ్తూ టిక్కెట్టు లేకుండా రైళ్లల్లో తిరిగే తుక్కురకం బిచ్చగాండ్లు కాదుసుమా ! సాధులు సంన్యాలు అంటే.

"యుధ్యస్వ విగతజ్వరః" (3-30) "విగతజ్వరుడవై యుద్ధం చేయా" లని భగవంతుని ఆదేశం. కర్మయోగి విగతజ్వరుడై కర్మ చేస్తాడు. సామాన్య మానవుడు అలా చేయలేడు. కర్మ చేయడంలో యిద్దరూ ఒకే రకమే అయినా, ఇద్దరి భావాలలో వ్యత్యాసం వుంది. బాధలేక భారం లేక సవ్యసాచిలాగా భక్తుడు పనిచేస్తాడు. అందరూ ఒక్క చేతితో చేస్తే, సవ్యసాచి రెండు చేతులా యుద్ధం చేస్తాడు. సామాన్య మానవుడు ఒక్కంత పనిచేస్తే జ్ఞానికాని, భక్తుడు కాని రెండింతలుగా చేస్తారు.

తులసీదాసు భక్తునికి దృష్టాంతంగా నాలుకను చెప్పాడు. నాలుక ముప్పది రెండు పండ్ల మధ్య నిరత నిరంతరం కసిమసగి తిరుగుతూన్నా దెబ్బ తినదు. భక్తుడూ అంతే. హోరా హోరి వికట సంకటాలల్లో తిరుగుడు పడ్తూ కూడా ప్రహ్లాదునిలాగా స్థిరుడై వుంటాడు. నాలుక పని పడినప్పుడు తప్ప బైటికిరాదు. భక్తుడూ అంతే, అవసరం వచ్చేంత వరకు బైటపడడు. నాలుకకు సంగ్రహబుద్ధి లేదు. ఇచ్చిన వస్తువును ఆవలో యీవలో పడవేయడమే సరి. వీడూ అంతే. భక్తునికి యే వస్తువుతోనూ దృఢసంగం లేదు. ప్రతి యొక్క యింద్రియం ఒక్కొక్క పనే చేస్తే నాలుక యిబ్బడిగా పనిచేస్తుంది. మాట్లాడడం, రుచులు చూడడం. భక్తుడు అంతే, రెట్టింపుగా పనులు చేస్తాడు.

కర్మత్యాగులు నాల్గురకాలు. బద్ధకంతో ప్రొలుమాలి పనులను వదిలేవారు ఒకరకం. ఇట్టి వాళ్లు భగవంతుని దృష్టిలో దొంగలు, మిథ్యాచారులు, పాపజీవులు. వివిదిషా సంన్యాసులు విద్వత్సంన్యాసులు అనగా సాధకులు సిద్ధులు కూడా కర్మత్యాగులే. కానీ మరొక్కరకం

కర్మత్యాగి వున్నాడు. అతడే భగవంతునికి అత్యంతం సమ్మతమైనవాడు. కర్మలు చేస్తూ ఫలాన్ని కోరనివాడు. ఫలకాంక్షతో దీనుడు కానివాడు. అలాంటి పుణ్యాత్ములనే భగవంతుడు అపేక్షిస్తూన్నాడు. ఈ మూడో అధ్యాయం కర్మయోగంలో సారమైన మాట అదే. "జ్ఞానివో అజ్ఞానివో, సాధకుడివో సిద్ధుడివో యెవ్వడివైనా సరే-వూరక వుండేందుకంటే సని చెయ్యడం మంచిది."-అంటూ భగవంతుడు తెగత్రెంచి చెప్పేశాడు. అస్తు.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

1. కె.సురేష్‌కుమార్ (ఎల్-767), అనంతపురం	-	రూ. 1500/-
2. సి. హెచ్.దశరథరామిరెడ్డి (నాయుడుపేట)	-	రూ. 2000/-
3. కోడూరి కృష్ణమూర్తి (ఎల్-178) సుందరంనగర్	-	రూ. 1500/-
4. ఎడ్ల.మన్నెంరెడ్డి -(నాగరకర్నూలు)	-	రూ. 2000/-
5. ఎ.రవీంద్రర్ (హైద్రాబాద్)	-	రూ. 2000/-
6. కె.ఎ.ఇందిర (ఎల్-268) (కొండాపూర్)	-	రూ. 1500/-
7. నారాయణరావు (హైద్రాబాద్)	-	రూ. 2000/-
8. చింతా శ్రీరాములు (హిందూపురం)	-	రూ. 2000/-
9.జి.హనుమంతరావు (2వ మారు) (మౌలాలి,హైద్రాబాద్)	-	రూ. 3000/-
10. ఎస్.నరసింహరావు (ఎల్-478)	-	రూ. 1500/-
11. డా॥ దోమా వెంకటేశ్వరరావు (ఎల్-473) (సికింద్రాబాద్)	-	రూ. 1500
12. పి. సత్యవతి (చెన్నై)	-	రూ. 2000/-
13. బి.మధుసూదనరావు (ఎల్-528) (బళ్ళారి)	-	రూ. 1500/-
14. నున్నా సత్యనాగకుమారి (లక్ష్మీపురం)	-	రూ. 2000/-
15. శ్రీచిదానందస్వామి (ఎల్-176) (శాన్తి ఆశ్రమం,వీరఘట్టం)	-	రూ. 1500/
16. వి.ఎస్.ఆర్.రామకృష్ణ (విజయవాడ)	-	రూ. 2000/-
17. వి.వి. రవికాంత్ (హైద్రాబాద్)	-	రూ. 2000/-
18. సి.సూర్యలక్ష్మి (ఎల్-668) (హైద్రాబాద్)	-	రూ. 1500/-

సాధన పంచకమ్

- శ్రీ సంపూర్ణనందగిరిస్వాములవారు

(గత సంచిక తరువాయి)

దుస్తర్కా త్సువిరమ్యతామ్

శాస్త్ర సమ్మతము కాని కుతర్కము నుండి బాగుగా విరమింపుము. తర్కమనగా "యుక్త్యా అర్థ నిర్ణయః తర్కః" వేదము చేత శాస్త్రము చేత హేతుబద్ధముగా ప్రతిపాదింపబడినది తర్కమనబడును। దుస్తర్క మనగా సారాంశము లేని తర్కమును దుస్తర్క మందురు. శాస్త్ర ప్రమాణమును, అనుభవజ్ఞుల వాక్యములను అంగీకరించక, తన యిచ్ఛానుసారం ప్రతిపాదింపబడిన భావమును దుస్తర్క మందురు. ఈలాంటి తర్కము సాధకుని మనస్సులోనికి రాకూడదు. దుస్తర్కభావాలున్న వారికి సాధకులు దూరముగా నుండవలెను. కాలం చాలా విలువైనది. గడచిన కాలము తిరుగరాదు. ధనం, భూమి, బంగారం మున్నగునవి నష్టమైనను మరల సంపాదించవచ్చును. కాలము నష్టమైనచో ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా, నష్టమైన కాలము తిరిగిరాదు. ప్రతి వారికి గర్భవాసములో నున్నపుడే ఎంత కాలం బ్రతకాలనేది నిర్ణయిమైనది. అంతవరకే బ్రతుకుతాము, తరువాత శరీరమును విడచెదము. అందుచే వ్యర్థ కార్యకలాపాదులతో జీవితమును గడపక శాస్త్ర సమ్మతమైన కార్యకలాపాదులతో జీవితమును గడపుచూ, శాస్త్ర సమ్మతమైన వాదముతో శీలించుచున్న ఎడల జీవితము ధన్యమగును. దుస్తర్కము వలన జీవితము వ్యర్థమగును. ఈ సంస్కారము జన్మ జన్మలకి వెంటాడి పతనము చెందుదురు. కావున సాధకుడు కుతర్కములను విడచిపెట్టవలెనని శ్రీఆచార్యుల వారు పందొమ్మిదవ సాధనను తెలిపిరి.

శృతిమతస్తర్కో ஽నుసన్ధీయతామ్.

వేద సమ్మతమైన తర్కమును అనుసరింపుము. 'యుక్త్యా వేదనీయః తర్కః ఽ శృతి మతస్తర్కః' సిద్ధాంత అవిరుద్ధే ప్రమాణ తర్క సాధనోపలంభః వాదః' సిద్ధాంతమునకు విరుద్ధము గాని విధమున ప్రమాణములచేతను, తర్కము చేతను, పరపక్షమును దూషించుటయు, స్వపక్షమును స్థాపించుటయు, తత్వనిరూపణము ఫలముగా గలది ఏది గలదో అదే వాదమనబడును. దీనినే వేద అభిప్రాయ తర్కమందురు. దేహాత్మవాదులు దేహమే ఆత్మయని "ఋణం కృత్వాఘృతం పిబేత్ భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః (కథం భవేత్)". అప్పు చేసి పప్పు కూడు తినమని, ఎవరికి ఋణముండదని, దేహమే లేనపుడు ఋణమెక్కడిదని వాదింతురు. వేదకర్మ సిద్ధాంతమును తెలియని అజ్ఞానులు వీరు. ఇంద్రియ, ప్రాణ, మనో, బుద్ధ్యాత్మవాదులు ఇటువంటి వారు. యథార్థమును తెలిసి కొనక జన్మ జరా ప్రవాహంలో బడుచున్నారు. సాధకుడు ఉత్తమ గురువును, సచ్ఛాస్త్రములను ఆశ్రయించి, దానికి తగు ప్రమాణములను, యుక్తులను గ్రహించి, "శాంతం, శివమద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా సవిజ్ఞేయః" యనుశృతి వాక్యముల గ్రహించి 'అహం బ్రహ్మాస్మి, బ్రహ్మైవాహమస్మి' అను వాక్యముల అనుసంధానమును (సాధకుడు) చేయవలెనని ఈ ఇరువదవ సాధనలో శ్రీఆచార్యుల వారు తెలియజేసిరి.

చందాదారులకు విజ్ఞప్తి

వేదాన్తభేరికి వార్షిక చందాదారుల వార్షిక చందా ఈ డిశంబరుతో ముగిసినది. కాబట్టి చందాదారులు తమ వార్షిక చందా నూరు రూపాయలను ఈ నెల 30 తేదీ లోపల మాకు చేరునట్లు యం.ఓ. ద్వారా పంపగోరుచున్నాము. - పబ్లిషర్

భాగవతం షష్ఠస్కంధము

- శ్రీ మాతా పరావిద్యనందగిరి స్వామిని

(అక్టోబరు సంచిక తరువాయి)

ఈ బ్రహ్మవాక్యములను విన్న దేవతలు విశ్వరూపుని చెంతకేగి ఆతనిని దగ్గర కూర్చుండ బెట్టుకొని ఈ విధముగా తమ విషయమును తెలియజెప్పిరి. నాయనా విశ్వరూపా! మేము నీకు పితృతుల్యులము. నీ ఆశ్రమమునకు అతిథులమై వచ్చాము. "పుత్రాణాం హి పరోధర్మః పితృ శుశ్రూణషం సతామ్" ఎల్లపుడు తల్లిదండ్రులను సేవించుట పుత్రులయొక్క పరమ ధర్మము. అందునా నీవు బ్రహ్మచారివి. "ఆచార్యో బ్రహ్మణోమూర్తిః పితామూర్తిః ప్రజాపతేః । భ్రాతా మరుత్పతేర్మూర్తిర్మాతా సాక్షాత్ క్షితేస్తనుః॥ దయాయా భగినీ మూర్తిర్ధర్మస్యాత్మా ఽ తిథిః స్వయమ్ । అగ్నేరభ్యాగతో మూర్తిః సర్వభూతాని చాత్మనః ॥"

ఆచార్యుడు వేదస్వరూపుడు. తండ్రి బ్రహ్మదేవుని స్వరూపుడు. సోదరుడు ఇంద్రుని వంటివాడు. తల్లి సాక్షాత్తు భూదేవి స్వరూపము. సోదరి దయయే. అతిథి ధర్మమూర్తి. ఇక అభ్యాగతుడు సాక్షాత్తు అగ్నితో సమానము. సకల ప్రాణులూ ఆత్మస్వరూపమే. ఇక్కడ ఇంటికి వచ్చిన వారిని అతిథులు, అభ్యాగతులూ అని రెండు రకాలుగా విభజన చేశారు. అతిథులనగా తిథి, వార, నక్షత్ర, సమయ, సందర్భాలు లేకుండా తెలిసిన వారు గాని, తెలియని వారని గాని అనుకొనవచ్చును.

అభ్యాగతులనగా మనము ఆహ్వానిస్తే మన చెంతకు వచ్చినవారు అని అనుకొనవచ్చును. "అతిథి దేవోభవ" అని వేదము చెప్పినట్లు మేమునీకు అతిథులము. మమ్ముల గౌరవించుట నీ ధర్మము అని చెబుతున్నారు. ఇంకనూ మేము మా సంపదనంతనూ కోల్పోయి చాలా దుఃఖములో ఉన్నాము. మేము నిన్ను మా ఆచార్యునిగా ఎన్నుకొను చున్నాము. నీ తపోబలము వలన మేము మా పూర్వవైభవమును తిరిగి పొందగలమని తలంచుచున్నాము.

న గర్హయంతి హ్యర్థేషు యవిష్ఠాంఘ్ర్యభివాదనమ్ ।

ఛందోభ్యో ఽ న్యత్ర న బ్రహ్మన్ వయో జ్యైష్ఠ్యస్య కారణమ్ ।

పెద్దరికము వయస్సును బట్టిరాదు. వేద జ్ఞానమును బట్టి వచ్చును. నీవు వేదజ్ఞాన స్వరూపుడివి. గనుక మా కంటే పెద్దవాడవే. సందర్భమునను సరించి తమకంటె వయస్సులో చిన్నవారైన వారి పాదములకు నమస్కరించుట తప్పు కాదని విజ్ఞులు తెలుపుదురు అంటూ దేవతలు విశ్వరూపుని నమస్కరించి తమకు ఆచార్యునిగా వుండవలసినదిగా కోరుకొనిరి.

వారి మాటలను విన్న విశ్వరూపుడు పౌరోహిత్యము బ్రహ్మ వర్చస్సును క్షీణింపజేయును. కాని లోకపాలురైన మీ మాటలను నేను త్రోసి పుచ్చలేను. మేము అకించనులము. అనగా ఉంఛవృత్తితో జీవించు వారము. అనగా రైతులు ధాన్యమును పండించిన పిదప కల్లములో వాటిని బాగుచేసి ఉపయోగించుకొందురు. రైతులు పండించిన ఆ ధాన్యము పొలములో రాలిపోయిన ధాన్యమును ఏరుకొని దానితో దేవకార్యమును పితృ కార్యమును ఆచరించు చుందుము. ఇట్టి నేను పౌరోహిత్యమును ఎట్లు చేయగలను? ఐనను నేను మీ కోరికను తిరస్కరించలేను. నా ప్రాణమును, తపోబలమును ఒడ్డిఅయినా మీ మనోరథమును నెరవేర్చదను.

మహాతపస్వి అయిన విశ్వరూపుడు దేవతలకు ఇట్లు ప్రతిజ్ఞ చేసి దేవతల పౌరోహిత్య వృత్తిని చేపట్టెను. శుక్రాచార్యుడు తన నీతి బలముతో అసురుల సంపదను సురక్షితంగా భద్రపరచెను. అయినను విశ్వరూపుడు తన నారాయణ కవచ ప్రభావంతో ఆ సంపదలను సంగ్రహించి దేవేంద్రునకప్పగించెను. విశ్వరూపుడు నారాయణ కవచమును దేవేంద్రున కుపదేశించెను. దేవేంద్రా! దీని వలన నీవు ఇకపై సురక్షితుడవు కాగలవు. ఈ కవచ ప్రభావం వలన నీవు సులభంగా అసుర సేనును జయింపగలవు అని చెప్పెను.

కోపము

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు,
(శ్రీ శుకబ్రహ్మాశ్రమము)

కోపము అన్నది మనస్సుయొక్క ఒక వికారము, అంటే దాని సమస్థితికి అంతరాయము కలగడము. ఇది అన్ని ప్రాణులయందు కొన్ని సందర్భాలలో కలుగుతుంటుంది. మనిషికి సంబంధించిన కోపాన్ని గురించే ఇక్కడ వ్యాఖ్యానించ బడుతున్నది. సత్వరజస్తమోగుణాల ద్వారా ఏర్పడిన వాసనలు (సంస్కారాలు) మనిషి చిత్తంలో నిలవ చేయబడి వుంటాయి. మనిషియొక్క జాగ్రదవస్థలో మనసు గ్రహించే శబ్ద స్పర్శరూపరస గంధాత్మకమైన బాహ్య విషయాలు చిత్తంలో గల వాసనలకు ప్రతికూలంగా వున్నప్పుడు మానసిక సంతులనానికి అంటే శాంతికి భంగము కలుగుతుంది. బాహ్య విషయాలను తనకు అనుకూలంగా మార్చుకుని తనశాంతిని, సుఖాన్ని కాపాడుకొనడానికి మనసు ప్రయత్నిస్తుంది. అంతఃకరణములోని రజోగుణతమోగుణాల ఆధిక్యతను కలిగివున్నప్పుడు మనోవికారము కోపము రూపంలో ప్రకటమౌతుంది. సత్వగుణము అధికంగా వున్నప్పుడు కోపమనేది పుట్టడానికి అవకాశము లేదు.

వర్షము కురిసే ముందు కారుమబ్బులు, చీకటి, పెద్దగాలి, మెరుపులు, ఉరుములుకలగటము మనము తరచు చూస్తుంటాము. అదేవిధంగా కోపమనే మనోవికారము అనేకమైన లక్షణాలను పుట్టిస్తుంది. ముఖము ఎర్రబడటము, పెద్దగా అరవడము, పళ్ళు పటపట కొరకడము, వస్తువులను విసిరికొట్టడము ఇత్యాధులు కోపలక్షణాలు. విషయాలు గనక తన అదుపులోకి రాకబోతే మరికొన్ని ప్రాణాపాయకర వృత్తులను కూడా కోపము పుట్టిస్తుంది.

కోపము వలన అపారమైన శక్తి నష్టమౌతుంది. గుండెపోటు పెరిగిపోతుంది, వివేకము నశించిపోతుంది. "క్రోధాద్భవతి సమ్మోహః"

అన్నది శ్రీమద్భగవద్గీతా శ్లోకము.

ఇంత అనర్థకరమైన కోపము అన్నది అసలు ఎట్లా పుట్టింది? ఇది కూడా పరమాత్మశక్తి ఐన ప్రకృతి గుణాల వల్లనే పుట్టింది. అంటే సృష్టిలో ఒక భాగమే అని అర్థము. దీన్ని యుక్తాయుక్త వివేకంతో ఉపయోగించుకుంటే సత్ఫలితాలను చేకూర్చగలదు. మనిషి గూడా తన ప్రయోజనాల కోసము, విద్యుత్తు, ఇంధనాలైన పెట్రోలు, వంటగ్యాస్, కత్తులు, గృహోపకరణాలు, యంత్రాలు, వాహనాలు, రైళ్ళు, విమానాలు ఇత్యాదులను ఎన్నిటినో తయారు చేసుకున్నాడు. ఇవన్నీ ఎంతో ప్రమాదకరమైనవే గదా! ప్రాణాంతకమైనవే గదా! ఐతే జాగ్రత్తగా వివేకంతో వాటిని వాడుకుని తన జీవితాన్ని సుఖమయము చేసుకుంటున్నాడు. అందుచేత కోపమన్నది స్వయంగా ప్రమాదకారి కాదు అని తేలుతున్నది.

గురువులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు మొదలైన శ్రేయోభిలాషుల విచక్షణయుక్తమైన కోపము విద్యార్థులను, శిష్యులను, బాలబాలికలను ఉత్తమ సంస్కారవంతులుగాను, విద్యావంతులు గాను తయారు చెయ్యడానికి దోహదము చేస్తున్నది.

శ్రీమద్రామాయణములో వాలివధానంతరము సుగ్రీవుడు భోగవిలాసాలలో మునిగిపోయి, వర్షఋతువు గడిచిపోయిన తరువాత సీతాదేవిని వెతికిస్తాను అని, శ్రీరామచంద్రుడికి తను ఇచ్చిన మాటను విస్మరిస్తాడు. ఆ సమయంలో లక్ష్మణుడు చూపించిన కోపానికి భయపడి తన తప్పిదాన్ని తెలుసుకుని తన మాటను నిలబెట్టుకుని తన వారికి ధాశరథులకు కూడా అపారమైన ఆనందాన్ని కలిగించాడు.

పరమశాంతమూర్తి శ్రీరామచంద్రుడు సముద్రుడిపైన చూపిన కాస్తకోపము సముద్రుడిని భయపెట్టి సేతునిర్మాణానికి కారణమై, అధర్మపరుడైన రావణుడి సంహారానికీ లోకశాంతికి కారణమైంది.

శ్రీ నరసింహావతారములో త్రిలోక కంటకుడై అపార ధర్మహానిని కలిగించిన హిరణ్యకశిపుడిని సంహరించడానికి ఆయన ధరించిన కోపానికి ఎల్లలు లేవు. ఐనాకూడా చేయవలసిన కార్యము పూర్తికాగానే తన భక్తుడైన ప్రహ్లాదుడు తన పాదాల పైన పడటంతోటే చిటికెలో ఆ కోపము అదృశ్యమై పోయింది.

ఈ విధంగా విచక్షణయుక్తమైన కోపము శాంతికి ఆనందానికీ హేతువౌతుంది. ఇక విచక్షణ రహితమైన కోపము అనర్థానికే దారి తీస్తుంది. త్రిలోక గురువు ఐన శంకరుడి మీద ప్రజాపతి, మామగారు ఐన దక్షుడు చూపిన కోపము తన శరీరాన్నే అంతం చేసింది. దాక్షాయణి ఐన సతీదేవి (పార్వతీదేవి). తన తండ్రి చేసే యజ్ఞానికి వెళ్ళడానికి భర్త ఐన శివుడు అనుమతించ లేదని కోపముతో తన పుట్టినింటికి వెళ్ళింది. అక్కడ తన భర్తను అవమానించిన తన తండ్రి మీది కోపంతో అగ్నిలో ఆహుతి ఐపోయి తన భర్త నుండి దూరమై పోయింది.

పరశురాముడి మీద కోపాన్ని చూపి కార్తవీర్యుడి కొడుకులందరూ అంతమై పోయారు.

ఇప్పుడు ఇతరులు మనపైన చూపే కోపాన్ని ఏవిధంగా సద్వినియోగము చేసుకోవాలో విచారిద్దాము. ఇతరుల కోపానికి ఆహుతి కాకుండా వుండాలంటే మనలోపల సత్త్వగుణాన్ని పెంచాలి. భగవన్నామ కీర్తన, బ్రహ్మజ్ఞానుల బోధనల శ్రవణమనన అభ్యాసాలు, మన స్వరూపచింతన ఇత్యాదులు సత్త్వగుణాన్ని పెంచుతాయి.

సూర్యవంశపు అంబరీష మహారాజు ఆవిధంగా భగవదనుగ్రహాన్ని పొంది దూర్వాసమహాముని మహాకోపంతో సృష్టించి, తనను వధించమని పంపిన మహాభయంకర ప్రాణి కృత్యకు కూడా ఏ మాత్రము చలించక సత్త్వగుణ బలాన్ని చాటాడు. శ్రీమద్భాగవతములో పరీక్షిత్ మహారాజుకు మునికుమారుడైన శృంగి కోపముతో ఏడవనాడు తక్షకుడనే సర్పము

కాటుచేత మరణము కలిగేటట్టు శపించాడు. పరీక్షిత్ అతడిని దండించే శక్తి సామర్థ్యాలు కలవాడైనా గూడా ఆ శాపానికి ఏ మాత్రము కోపగించక ఆ ఏడు రోజులలో శ్రీశుకుల వారి బోధను విని జననమరణరహిత పరమానంద పరమాత్మ స్థితిని సాధించుకున్నాడు. ఆ విధంగా ఇతరులకు మనపైన కలిగిన కోపాన్ని సద్వినియోగము చేసుకోవచ్చును. లోకంలో ఇతరుల ద్వారా కించిత్తు పని కావాలన్నా గూడా ధనము, అభ్యర్థన ఇత్యాదులు అవసరము. అటువంటిది మనము అడగకుండానే, ఎటువంటి డబ్బు ఖర్చు లేకుండానే మనలోకి ఏదో ఒక దోషాన్ని చూసి దాన్ని కోపం ద్వారా ప్రకటిస్తారు కొందరు. ఇతరుల కోపంలో గల సందేశాన్ని మటుకు గ్రహించి మన లోపాలను సరిదిద్దుకుని జీవితాన్ని ఉత్తమంగా చేసుకోవచ్చును. ఒకవేళ మనలో ఎటువంటి దోషమూ లేనట్లైతే కోపపడిన వారిదే పొరపాటు కావడము వలన వారి కోపము వారికే కీడును అపకారాన్నీ కలిగిస్తుంది. కానీ మనకు ఏహానీ జరగదు. కొంత అభ్యాసము చేస్తే ఇది అలవాటై ప్రశాంతినిస్తుంది.

లోకంలో కోపాన్ని అదుపు చేసుకోలేని వారు అనేక సమస్యల పాలై తాము అశాంతిపాలై ఇతరులను గూడా అశాంతి పాలు చేస్తారు. కోపాన్ని తగ్గించుకోవాలి అని అనుకున్నంత మాత్రాన అది తగ్గదు. పైన చెప్పిన సాధన ద్వారా తత్త్వజ్ఞానాన్ని సంపాదించినప్పుడే ఆ కోపము వ్యక్తిని వదిలి వెళ్ళిపోతుంది.

"కామక్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్

అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్"

అని శ్రీమద్భగవద్గీతా వాక్యము - కామక్రోధాలను వదలి పెట్టి తమ స్వరూపాన్ని తెలుసుకున్నవారి ఎదటనే బ్రహ్మానందము వున్నది అని శ్లోక భావము. ఆ విధంగా కోపానికి స్వస్తి చెప్పి జీవితాన్ని ఆనంద మయం చేసకొందాము. ఓం తత్ సత్

ప్రయాణం

- డా॥ ఎ.తారాలక్ష్మి,

ఎం.ఎ., ఎం.ఇడి.,ఎమ్.ఫిల్.పి.హెచ్.డి. (శ్రీకాళహస్తి)

జాగ్రత్తు ఇహానికి, స్వప్నం పరానికి, సుషుప్తి మోక్షానికి సంకేతాలు. జీవించి ఉన్న కాలం ఇహం, మరణించిన తరువాత పొందేది పరం. ఇహానికి పరానికి మధ్య రాకపోకలే సంసారం. జాగ్రత్తు నుండి స్వప్నానికి, తిరిగి స్వప్నం నుండి జాగ్రత్తుకు, ఇహం నుండిపరానికి, మళ్ళీ పరం నుండి ఇహానికి రాకపోకలు జరపడమే సంసారం. ఒక చేప ఈ తీరం నుండి ఆ తీరానికి, తిరిగి ఆ ఒడ్డు నుండి ఈ ఒడ్డుకు, అటు ఇటు తిరుగాడుచున్నట్లు జీవుడనే చేప జాగ్రత్తు నుండి స్వప్నానికి, సుషుప్తికి తిరిగి జాగ్రత్తుకు అటు, ఇటు తిరుగాడుచునే ఉంటాడు. రెండు తీరాల మధ్య తిరుగాడే చేపకు ఏ తీరంతోనూ సంబంధం లేనట్లే, జీవునకు కూడా ఇహంతోనూ, పరంతోనూ ఎటువంటి తాదాత్మ్యము ఉండదు. ఇది అంతయు సంసార బంధానికి దృష్టాంతం. సంసార బంధానికి మూలము అవిద్యారూపమైన కారణ శరీరమే. ఈ దేహం ఇహం, మరణానంతరం లభించే మరొక దేహం పరం. ఇహం నుండి పరానికి జీవుడు ఎలా ప్రయాణిస్తున్నాడో పరిశీలిద్దాం.

స్థూల శరీరానికి మరణము దేని నిమిత్తంగా వస్తుందో ప్రత్యేకించి చెప్పలేము. ముసలితనం వలన కానీ, వ్యాధుల వలన కానీ, పిండ శరీరం కృశించినపుడు ఉదాన వాయువు ఎగ శ్వాసగా పైకి వెళ్ళినపుడు మరణం సంభవిస్తుంది. మరణము మహా సుషుప్తి. హృదయం నుండి అసంఖ్యాకమైన నాడులు దేహంలో అన్ని వైపులా వ్యాపించి ఉంటాయి. మరణ సమయములో దేహేంద్రియ శక్తులన్నీ వాటి వాటి స్థానాల నుండి లాగి వేయబడుతాయి. ఇంద్రియాలు అన్నీ తమ తమ కార్యాలను నిలిపి

వేస్తాయి. అంతఃకరణ శక్తులు, ఇంద్రియ శక్తులు హృదయం వద్ద విడిది చేస్తాయి. మనస్సంతా వ్యాకులమవుతుంది. మర్మ స్థానాలన్నీ వాటి వాటి స్థానాల నుండి వేరుపడుతూ ఉంటే స్మృతి తప్పిపోతూంటుంది. బుద్ధి విక్షేపంఆగిపోతుంది. దేహంలో అన్ని పనులూ ఆగిపోతాయి. హృదయానికి అగ్రభాగమే నిర్గమద్వారం మరణ సమయంలో హృదయము ఛిద్రమవుతుంది. నిర్గమద్వారం మండుతుంది. లింగ శరీరం స్థూల శరీరాన్ని వీడి తన కర్మ ఫలములను అనుభవించుట కొరకు ఈ దేహమును వీడి మరొక దేహంలోకి ప్రయాణం సాగిస్తుంది.

ఉపనిషత్ ఋషులు మరణాన్ని వివరించడానికి అద్దె ఇంటితో నివసించు వ్యక్తి, ఒక ఇంటి నుండి మరొక ఇంటికి మారు సందర్భాన్ని ఉదహరించారు. లింగోపాధి అయిన జీవుడు స్థూల శరీరాన్ని వీడి, మనస్సు మరియు ప్రాణముల కూడికతో ఏర్పడిన లింగ శరీరము అను బండిలో ప్రవేశిస్తాడు. ఈ లింగ శరీరం జీవునకు ఉపాధి మాత్రమే. లింగ శరీరంలోని మనస్సు జ్ఞానాన్ని, ప్రాణం కర్మను ప్రొగు చేసుకుంటుంది. బండిని నడుపువాడు లింగోపాధి అయిన జీవుడు. అవిద్యా వశుడైన జీవునకు ఏ మార్గములో ప్రయాణించాలో తెలియదు. జీవుని వెనుక నున్న ప్రత్యగాత్మ జీవాత్మను నడుపుతూ ఉంటుంది. వాసనా జ్ఞానం దారిచూపుతూ ఉంటే లింగ శరీరం ప్రయాణం సాగిస్తుంది. లింగ శరీరం అనే ఈ బండిలో జీవుడు చేసుకున్న కర్మ ఫలాలు, జీవుడు పొందిన జ్ఞాన ఫలాలు మరియు జీవుడు గత జన్మలలో చేసుకున్న సంచిత కర్మల వాసనలు ఉంటాయి.

జాగ్రత్తులో ఒక రకమైన జ్ఞానం, స్వప్నంలో మరొక జ్ఞానం ఉన్నట్లే ఇహంలో ఒక రకమైన జ్ఞానం, పరంలో కర్మ వశమున కలిగే మరొక రకమైన జ్ఞానం ఉంటుంది. మరణ సమయంలో దుఃఖం

అనుభవానికి వస్తూ ఉంటుంది. పురుషార్థ సాధన చేయకపోతినే, అన్న భావన కలుగుతూ ఉంటుంది. ఈ పరిస్థితిని భర్తృహరి, ఇల్లు కాలిపోతూ ఉంటే బావిని త్రవ్వాలని సంకల్పించడంగా అభివర్ణించారు.

ఈ శరీరమనే ఇల్లు స్వస్థతలో ఉన్నపుడే, ముసలితనం రాకముందే ఇంద్రియాలు మన అధీనంలో ఉన్నపుడే, "ఉత్తిష్ఠ, జాగ్రత " అన్న శృతి వాక్యము ననుసరించి ధృఢ ప్రయత్నముతో ఆర్య జ్ఞానాన్ని పొందవలెను. మోక్షపురుషార్థము కొరకై జీవించి ఉన్నంత కాలము ఈ శరీరాన్ని ఉపయోగించవలెను.

మరణ సమయములో జీవుడు మరణభీతికి లోను గాక ధైర్యముగా ఉండవలెనంటే, ఆతను తన జీవిత కాలములో యోగాన్ని, ధ్యానాన్ని అభ్యసించి, శాస్త్రాలను అధ్యయనము చేసి, శ్రవణ, మనన, నిధి ధ్యాసనలను అలవరచుకొనవలె. మృత్యు ముఖములో నున్న మానవ జీవితము, లేమావి చిగురు నంటిన నీటిబొట్టు వంటిది. ఇది నేల రాలుటకు నిమిత్తాలు ఎన్నైనా ఉండవచ్చును. కనుక కాలమును సద్వినియోగ పరచుకొని ఆ పరమాత్మ భావనను నిరంతరము ఆ వృత్తి చేసుకుంటూ ఉండాలి.

జీవుడు తాను విశేషంగా ఉన్నంత వరకు జనన మరణాలు తప్పవు. ఈ రూపం నేను, దీని వ్యాపారం నేను, ఆకారం నేనే, ఈ వృత్తులు నేనే, ఈ ప్రాణం నేనే అని విశేషంగా భావించినంతవరకు జీవునకు జనన మరణ రూప సంసారం తప్పదు. నేను విశేషంకాని, నిరాకారమైన, సర్వవ్యాపకమైన, స్వతః సిద్ధమైన, ఆత్మ రూప చైతన్యమే నేను - అన్న నిధి ధ్యాసనను ధృఢ పరచుకొంటే, విశేషాలు నశిస్తున్నా, సామాన్యము నశించదు. కనుక జీవుడు మరణాన్ని తప్పించు కొనగలదు.

వరాహావతార ప్రశస్తి

- ఆర్. శోభాదేవి,
(హైద్రాబాద్)

స్వాయంభువు మనువుకాలంలో వరాహావతారం వచ్చింది. శ్రీహరి దర్శనార్థమై వెళ్ళిన బ్రహ్మ మానసపుత్రులైన సనకసనందనాదులను ద్వారపాలకులైన జయ విజయులు అడ్డగించి శాపం పొంది రాక్షస జన్మ లెత్తారు. సత్యయుగంలో మొదటి జన్మలో దితిపుత్రులుగా హిరణ్యాక్ష హిరణ్య కశపులైనారు. బలవిక్రమోపేతుడైన హిరణ్యాక్షుడు గదను ధరించి ఎదురులేని వాడై స్వర్గంపై దండెత్తగా దేవతలు భయంతో పారిపోయారు. హిరణాక్షుడు జలక్రీడకు సముద్ర జలాలలో ప్రవేశించి గదా ప్రహారంతో నీటిని అల్లకల్లోలం చేశాడు. శత్రువు ఎవరూ దొరకక యుద్ధం చేయాలనే దుగ్ధతీరలేదు. వరుణదేవుని విభావరీ నగరం ప్రవేశించి అతనినే యుద్ధానికి ఆహ్వానించాడు. నీతో నేను పోరాడ లేను. విష్ణువే నీకు సరియైన జోడి. అతనిని జగమంతా పొగుడుతుంది అని వరుణుడన్నాడు. వైకుంఠానికి వెళుతున్న హిరణ్యాక్షునికి దారిలో నారదుడు కనిపించి 'విష్ణువు వైకుంఠంలో లేడు రసాతలంలో వున్నాడు' అని తెలిపాడు.

భూమి రసాతలంలో వుంది. ఎలా సృష్టిచేయాలా అని ఆలోచిస్తూ బ్రహ్మ పరమాత్మను ధ్యానించగానే అంగుష్ఠమాత్ర ప్రమాణంలో పిల్ల వరాహంగా బ్రహ్మ ముక్కులో నుండి బయటికి వచ్చి చూస్తుండగానే పర్వతంలా పెరిగింది. వరాహమూర్తి ఘుర్ఘుర ధ్వనులు విన్న ముల్లోకాల లోని వారు వేదమంత్రాలతో స్తుతించారు. యజ్ఞ వరాహమూర్తి తన ముక్కుతో వాసన చూస్తూ భూదేవి జాడను తెలుసుకొని తన కోరలపై నిలుపుకొన్నాడు. జలాలపైకి వస్తున్న వరాహమూర్తిని హిరణాక్షుడు ఎదిరించాడు. నీవు మాయతో దైత్యులను సంహరిస్తుంటావు. నా గదాప్రహారంతో నిన్ను అంతం చేస్తాను. నిన్ను ఆరాధించే దేవతలు, ఋషులు నీతోనే నజారిపోతారు'అని

నిందా వాక్యాలు పలికాడు. భూదేవి భయ కంపిత అవుతున్నది. వరాహస్వామి ఎంతో సహనంగా వున్నాడు. హిరణాక్షుడు స్వామిని వెంబడించి పోరాడు తున్నాడు. భగవంతుడు తన పార్షదుడైన హిరణాక్షునితో క్రీడగా యుద్ధం చేస్తున్నాడు. భూదేవిని ధరించిన స్వామి రూపం యిలా వుంది.

తే.గీ ॥ తాలసీతాంశు రేఖావిభాసమాన
ధవళ దంష్ట్రాగ్రమున నున్న ధరణి యొప్పె
హరికి నిత్యానపాయిని యైన లక్ష్మి
నెరయ బూసిన కస్తూరి నికర మనగ. (భాగవతం)

యుద్ధాన్ని గమనించిన బ్రహ్మ ఇలా పలికాడు. 'నా వరాలను పొందిన ఈ దుష్టుడు దేవతలను బ్రాహ్మణులను గోవులను నిరపరాధులను భాధిస్తున్నాడు. ఇతనిని జయించగలవాడెవ్వడు లేడు. పరమాత్మా! సంధ్యా సమయం కావస్తున్నది. త్వరగా సహంరింపుము' అని బ్రహ్మ ప్రార్థించాడు.

విశ్వ విజయుడగు పరమాత్మ తన చేతితో హిరణాక్షుని గూబ గుయ్యి మనిపించాడు. ఆ చెంప దెబ్బకి గిరగిరా తిరిగి పడి పోయాడు. అతడు భగవంతుని ముఖం చూస్తూ ప్రాణాలు వదిలాడు. విష్ణువు పార్షదుడై నందున హిరణ్యాక్షుడు స్వామి చేతిలో మరణించే భాగ్యాన్ని పొందాడు.

మ॥ కనకాక్షుండు భుజా విజృంభణమున్ క్ష్మాచక్రముం జాపజు
ట్టిన మాడ్కిం గాలిపోవ యజ్ఞమయ దంష్ట్రీ స్వాకృతిం దాల్చియ
ద్దనుజాధీశ్వరు దాకి యట్టినడుమున్ దంష్ట్రాహతిం ద్రుంపధా
త్రిని గూలెం గులిశాహతిం బడు మహాద్రింబోలి యత్ర్యుగ్రతిన్॥

ఆధ్యాత్మిక భావం-హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టాడని నీటిలో

దాచాడని అంటారు. బ్రహ్మ సృష్టి చేయటానికి స్థలం లేక విష్ణుని ప్రార్థిస్తే అంగుష్ఠ మాత్రంగా బ్రహ్మ ముక్కులో నుండి పుట్టాడట. శ్రీహరి హిరణ్యాక్షుని హతమార్చి భూమిని రక్షించాడట. ఇందులో ఎన్నో అనుమానాలు కలుగుతాయి.

"హిరణ్యే అక్షిః ఇతి హిరణ్యాక్షః' హిరణ్యం అంటే బంగారం. ఎంతో విలువైనది. కన్నులు పంచేంద్రియాలలో ఎంతో ప్రధానమైనవి. ఈ ఇంద్రియానికి వశుడైన వాడు హిరణ్యాక్షుడు. భూమి మీద సంపదలన్నీ తనవే అనుకునే వాడు. తాను చూచిన దంతా తనకు వశం కావాలని తన సొంతం కావాలని కోరేవాడు. భౌతిక వస్తువుల నన్నింటినీ సమీకరించాలని (మూట కట్టాలనే) యోచన కలవాడు. అదే అజ్ఞానం. బ్రహ్మ అనే బుద్ధి. సర్వాంతర్యామి అయిన పరమాత్మ అనే చైతన్యాన్ని ఆశ్రయించింది.

సంపూర్ణ ఐహిక భావ లంపటమే అజ్ఞానం. చైతన్యాన్ని విడచి జడం లోనికి పోవడమే జలగ్రస్తమవడం. శ్రేష్ఠమైన అహం భావనయే వరాహం అని అంటారు. అదే రమణ మహర్షి చెప్పే "లోపలి నేను". సాధకునిలోని శ్రేష్ఠమైన అహంభావన కలగగానే వెంటనే నశ్వరమైన జగత్ రూపమైన లౌకిక కోరికలు నశిస్తాయి. అదే హిరణాక్ష సంహారం. వరాహం వచ్చి హిరణ్యాక్షుని అంతం చేసింది. అదే వరాహావతారం యొక్క అంతరార్థం. కృతయుగంలో హిరణాక్ష వధ జరిగింది.

కాలం ఏదైనా సాధకునిలో జరిగే మార్పు ఇదే. చాలామంది హిరణ్యాక్షులుగానే వుండిపోతారు. ఎన్ని జన్మలైనా పాపకర్మ ఫలితాలను అనుభవిస్తూ ఇంకా ఇంకా జడంలోకి వెళ్ళిపోతారు. ఈ భాగవత కథ తెలుసుక్కు తర్వాతనైనా మన నడవడికలో మార్పు తెచ్చుకొని పరమాత్మను శరణు పొంది వస్తువ్యామోహాలను వదలి సత్యాన్ని తెలసుకొని ముక్తి మార్గం పట్టాలి.

గోప్రశస్తి

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య (తిరుపతి)

గావో మమాగ్రతః సన్తు గావో మే సన్తు పృష్ఠతః ।
గావశ్శిరసి మే సన్తు గవాం మధ్యే వసామ్యహమ్ ॥ (మత్స్యపురాణం)

"గోవులు నా ముందు, నా వెనుక, నా శిరస్సు వైపున ఉండుగాక! గోవుల నడుమ నేనున్నాను"అని పై శ్లోకానికి భావం. గోవులకూ, మనుజులకూ మధ్య ఉండదగిన సంబంధాన్ని మత్స్య పురాణంలోని ఈ శ్లోకం నొక్కి వక్కాణిస్తున్నది.

ఈ విశ్వం చరాచర ప్రాణి కోట్లతో నిండి యున్నది. మనుజులు, పశువులు, పక్షులు మున్నగునవి చరప్రాణులు. చెట్లు, చేమలు మున్నగునవి అచర ప్రాణులు. ఈ ప్రాణులు వేటికవి విడిగా జీవించలేవు. వాటి జీవన విధానం పరస్పరాశ్రితమై యున్నది.

జంతువులతో మానవులకు గల సంబంధం సువిదితమే. అందులోనూ గోవులతో గల సంబంధం అతి సన్నిహితమూ, అతి శ్రేష్ఠమూ అత్యావశ్యకమూ అయి వున్నది.

పాలు, పెరుగు, నెయ్యి మున్నగు ఆహార పదార్థాలు గోవుల నుండే మనకు లభిస్తున్నవి. అందుకే "వినా గోరస కోరసోభోజనానాం" – "గోరసం లేని పక్షంలో భోజనంలో ఇక ఆస్వాదయోగ్యమైన రసమేది." అని ప్రశ్నించారు.

మాతృస్తన్యం లాగానే గోక్షీరం కూడా మనుజ శిశువులకు పోషకమై యున్నది. అందుచేతనే గోవును మాతగా పూజించే సంప్రదాయం భారతీయులలో ఏర్పడింది.

"గావో విశ్వస్య మాతరః"-"గోవులు విశ్వానికి తల్లులు" అని మన ప్రాచీనులు గోమాతను ప్రశంసించి యున్నారు.

అంతేకాదు. గోవులు దైవస్వరూపాలు గూడా.

'పదునాలుగు భువనంబులు

కుదురుగ నీ క్షుకి నిల్పుకొను నేర్పరివై' అని శ్రీకృష్ణ భగవానుణ్ణి కవులు కీర్తించారు. కృష్ణుడు బాల్యంలోనే తల్లికి తనలో నున్న పదునాలుగు లోకాలను చూపాడు. ఆ విశ్వరూప దర్శనం ఆమెకు ఆశ్చర్యం కల్గించింది. అట్లే 'గవామంగే తిష్ఠన్తి భువనాని చతుర్దశ' అని గోవులలో పదునాలుగు భువనాలున్నట్లు పెద్దలు గో ప్రశస్తిని వినుతించారు. గోవును ఆరాధిస్తే విశ్వ రూపధారియైన భగవంతుణ్ణి ఆరాధించినట్లే అని దీనివల్ల తెలుస్తున్నది.

గావః పుణ్యాః పవిత్రాశ్చ గోధనం పావనం తథా ।
గావో భవిష్యం భూతంచ గోషు సర్వం ప్రతిష్ఠితమ్ ॥

అని పురాణాలు గోవులలో సర్వమూ ప్రతిష్ఠితమై యున్నదనీ, మన భూత భవిష్యత్తులు గోవులే అనీ, గోధనం పరమ పావనమైనదనీ వర్ణించాయి.

మానవులకు దానం చాలా ప్రశస్తమైన గుణం. అందుకే 'దాతా భవతి వా నవా' అన్నారు. పూర్వం దాతలు ప్రధానంగా గోవులనే దానంగా ఇచ్చేవారు. గోదాన ఫలాన్ని స్మృతులు, పురాణాలు ఘనంగా ప్రశంసించాయి.

గోదానం లాగా గోపూజ గూడా ప్రశస్తమే. గృహ ప్రవేశాది శుభ కార్యాలలో గోవును పూజించడం కద్దు.

గోపూజ వివిధ శుభాలను ప్రసాదిస్తుంది. రఘువంశ చరిత్రంలో సంతానహీనుడైన దిలీప మహారాజు వసిష్ఠుని సూచననుసరించి గోపూజ కావించి సంతాన వంతుడయ్యాడని మహాకవి కాళిదాసు వర్ణించాడు.

ఆ వంశంలో అవతరించినవాడే అవతార పురుషుడైన శ్రీరామచంద్రుడు.

గోవు సాధు జంతువు. జంతువులలో సింహాదులైన క్రూరమృగాలు కూడా ఉన్నాయి. అవి ఇతర ప్రాణులను చంపి వాటి మాంసం తిని జీవిస్తాయి. గోవులో అట్టి క్రౌర్యం లేదు. అది శాకాహారి. దాని నుండి మానవులు అహింసా తత్త్వం నేర్చుకోవాలి. జాతరల వంటి కార్యాలలో పశుబలి నిషేధాన్ని తూ.చా. తప్పకుండా పాటించాలి.

ప్రపంచంలో ప్రతి జాతివారూ అనాదిగా వచ్చే కొన్ని సంప్రదాయాలను పాటిస్తారు. ఆ సంప్రదాయాలలో పాటింపదగినవీ, పాటింపదగనివీ అయిన ద్వివిధసంప్రదాయాలున్నాయి. అందులో ముఖ్యంగా పాటించుటకు అర్థం కాని జంతుబలి వంటి దురాచారాలను వర్జించి మానవుడు తన నాగరికతనూ, విజ్ఞానాన్నీ సఫలం చేసుకోవాలి.

గోవుల విశిష్ఠతను గురించి వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, శాస్త్రాలు, కావ్యాలు పలు విధాలుగా వర్ణించాయి. కథా కథన విధానంతో కొన్ని గ్రంథాలు గోవుల ఉత్కృష్టతను వివరించాయి. సత్య కామ జాబాలి మున్నగు వారి పవిత్ర చరిత్రలు ఉపనిషత్తులలో చదివితే గో సేవకు గల ప్రాముఖ్యం చక్కగా గోచరిస్తుంది.

భారతీయుల ఒక పవిత్రమైన పనిని యజ్ఞమంటారు. భారతంలో గోవును యజ్ఞాంగంగా, అథవా యజ్ఞంగానే పేర్కొనదమైనది. అది లేకుంటే యజ్ఞ నిర్వహణ జరగదు.

యజ్ఞాంగం కథితా గావో యజ్ఞ ఏవచ వాసవ !
ఏతాభిశ్చ వినాయజ్ఞో న వర్తేత కథంచన ॥ (భారతం ఆనుశాసనికం)

యజ్ఞాంగమంటే యజ్ఞంలో బలియిచ్చే పశువుగా భావించరాదు.

నీచమైన అట్టి కృత్యాలకు ఈ వైజ్ఞానిక యుగంలో స్థానం లేదు. యజ్ఞారంభంలో గోపూజ నిర్వహించవచ్చు. ఆపూజనే యజ్ఞంగానో, యజ్ఞాంగం గానో భావించారు.

శరీరాలకు రోగాలు రావడం సహజం. వాటికి తగిన చికిత్సలు చేయాలి. ఆ చికిత్సలు, ఔషధాలు పలు రకాలు. అన్నింటికంటే సులభంగా అందుబాటులో ఉండే మందులు మనకు ఎక్కువగా ఉపకరిస్తాయి.

గోమూత్రం గోమయంక్షీరం దధి సర్పిస్తథైవ చ ।
గవాంపంచ పవిత్రాణి నిర్దిష్టాని మనీషిభిః ॥

అన్నట్లు ఈ శ్లోకంలో పేర్కొన్న గోమూత్రాది పంచగవ్యాలు అనేక రోగాలకు తగిన ఔషధాలుగా పేర్కొనబడి వున్నాయి. శ్రీలక్ష్మీదేవి గోవుల మలమూత్రాలలో నివసిస్తుందని భారతంలోని గో శ్రీ సంవాదంలో చెప్పడ మయింది.

విష్ణు ధర్మోత్తర పురాణంలోని ఈ క్రింది శ్లోకం గమనార్హం.

గవాం హి తీర్థే వసతీహ గంగా పుష్టి స్తథా తద్రజసి ప్రవృద్ధా।
లక్ష్మీః పురీషే ప్రణతౌ చ ధర్మః తాసాం ప్రణామం సతతంచ కుర్యాత్
(293- 42)

దీని భావమిది. "గోతీర్థంలో గంగ నివసిస్తున్నది. గో ధూళిలో పుష్టి ఉన్నది. దానికి నమస్కరిస్తే ధర్మ మాచరించినట్లువుతుంది. అందుచేత గోవుకు సదా ప్రణమిల్లాలి".

ఆర్య జాతి అనాదికాలం నుండీ గోవులను పెంచడంలో శ్రద్ధ వహించింది. గోవును భక్తితో ఆరాధించింది. దానివల్ల ఎంతో లాభపడింది. గోవులు ఆజ్య ప్రదానం ద్వారా యజ్ఞాలకు సహకరించి యజ్ఞాంగాలుగా కీర్తించబడ్డాయి.

అందుచేత సత్సంప్రదాయం పాటిద్దాం. గోవులను గౌరవంతో ఆదరించుదాం. చరాచర ప్రాణికోట్ల కన్నింటికీ సుఖం కలగాలి.

బాల్యంలో మేము ఒక గురుకులంలో విద్యాభ్యాసం చేశాం. చరాచరా సుఖాభిలాషిగా ప్రసిద్ధులైన ఒక మహర్షి స్థాపించిన గురుకులమది. ఆ గురుకులంలో ఒకటి రెండు చోట్ల గుండ్రని రాతి స్తంభాలు గురుదేవులు నాటించారు. క్రొత్తగా ఆశ్రమానికి వచ్చిన వారికి ఆ స్తంభం ఎందుకు నాటారో తెలియదు.

ఆశ్రమంలో గోవులున్నాయి. ఆ గోవులు తరచుగా సంచరించే ప్రదేశంలోనే ఆస్తంభాలు కనిపిస్తాయి. ఆ గోవులకు తమ శరీర పార్శ్వ భాగాలలో దురద కల్గితే, అవి నేరుగా ఆస్తంభాల వద్దకు పోయి ఆ స్తంభాలను రుద్దుకొంటూ దురద తీర్చుకొంటాయి. ఆశ్రమ విద్యార్థులమైన మాకు ఆదృశ్యం తఱచుగా కనిపించేది.

చరాచర సుఖాభిలాషిగా పేరొందిన గురుదేవులు ఆవిధంగా గోవులకు గూడా దురద తీర్చుకొనే సదవకాశాన్ని ఆస్తంభాలు నాటించడం ద్వారా కల్గించారు.

గోవులు మానవులవలె చరప్రాణులు. అచర ప్రాణులంటే చెట్లు-చేమలు మొదలగునవి. అవి గూడా బాగా పెరిగి తమ నాశ్రయించిన వారికి నీడనిచ్చి వారు సుఖపడేటట్లు సహకరించాలని గురుదేవుల అభిప్రాయం.

అందువల్ల గోవులకూ, మనకూ ఉండే సన్నిహిత సంబంధాన్ని మనసులో పెట్టుకొని వాటిక్షేమం కొరకై పాటుపడవలసిన బాధ్యత మనపై ఎక్కువగా ఉన్నదని గుర్తించి గోరక్షణకై పాటుపడదాం.

వార్తలు

(01). 31-10-2020 తేది శనివారం నిజ అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు గ్రామ హరిజనవాడ రామమందిరంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమ సద్గురు సర్వసేవా ట్రస్టువారిచే మధ్యాహ్నం 11 గంటల నుండి శ్రీరామచంద్రుని పూజ, భజన సంకీర్తన జరిపి అచటి ప్రజలకు అన్న సంతర్పణ చేయబడినది. ఆశ్రమ అధిష్ఠాన మందిరంలో ఆనాడు గురుపాదుకలకు పూజ చేసి ప్రసాద వినియోగం చేయబడినది.

(02). 2-11-2020 తేది సోమవారం నాడు కృత్తిక సందర్భంగా ప్రదోషకాలంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం అర్చన జరిగినది. 13-11-2020 తేది శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలో ప్రదోషకాలంలో నర్మదేశ్వర మహా దేవునికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేయబడినది.

(03). 7-11-2020 తేది నుండి ఆశ్రమ భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి కరోనా వలన 30-11-2020 తేది వరకు మూసి వేయబడినది.

(04). 14-11-2020 తేది ఆశ్రమంలో దీపావళి సందర్భంగా దీపాలతో ఓంకారం ఏర్పాటు చేసి ప్రణవజ్యోతి పూజ చేయబడినది. ఆశ్రమ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బందికి కొత్త వస్త్రాలు ఇవ్వబడినవి.

(05). 21-11-2020 శనివారం త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు సమావేశం శ్రీ శుకబ్రహ్మాశ్రమములో జరిగినది.

(06). 30-11-2020 సోమవారం కార్తీక పౌర్ణమినాడు అల్లిమడుగు తుఫాన్ గిరిజన సెంటరులో అచటి వినాయకునికి పూజ, భజనలు చేసి గిరిజనులకు అన్నదానం చేయబడినది.

చుక్కల నిడిగల్లు హరిజనవాడ రామమందిరంలో పౌర్ణమికి శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారి అన్నదానం

చుక్కల నిడిగల్లు హరిజనవాడ రామమందిరంలో పౌర్ణమికి
శ్రీశుకబ్రహ్మాశ్రమం వారి అన్నదానం

2018 - 20
Publication 26-11-2020,

Regd.No. TRP / 123 / 2018 - 20 December 2020 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-11-2020, Permitted to post : 29th, 30th every month.



ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Regd.No. TRP / 123 / 2018 - 20 December 2020 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-11-2020, Permitted to post : 29th, 30th every month.



శుకబ్రహ్మాశ్రమం
కార్తీక మాసంలో పూజింపబడిన శివలింగం

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం